రోడ్డు ప్రమాదాలకు నిలయం

- చిన అవుటపల్లి వద్ద అండర్ పాస్ నిర్మించాలి
- జాతీయ రహదారుల శాఖకు పలువురి వినతి
- రోజూ ప్రమాదకరంగా ప్రయాణం

గన్నవరం రూరల్: ప్రమాదకర ప్రయాణం ప్రాణాలను హరించివేస్తోంది. రోజూ వేలాది మంది నడిచే ప్రాంతంలో జాతీయ రహదారి నెత్తురోడుతోంది. మండలంలోని చిన అవుటపల్లి వద్ద జాతీయ రహదారి ప్రమాదకర ప్రదేశంగా మారింది. ఇక్కడ డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల, అనుబంధ ఆస్పత్రి, దంత వైద్య కళాశాల, స్కూల్, కాలేజ్ నర్సింగ్ కళాశాలలు, బీఎస్సీ పారా మెడికల్ కోర్సులు ఉన్నాయి. వీటిలో విద్యార్థులు, ఉద్యోగుల సంఖ్య 5వేలు ఉంది. అంతేగాక మెడికల్ కళాశాల చుట్టూ పదుల సంఖ్యలో అపార్టుమెంట్‌లు ఉన్నాయి. మరోవైపు చిన అవుటపల్లి గ్రామంలో సుమారు 2వేల మంది జనాభా ఉన్నారు. ఆస్పత్రికి రోజూ పేషంట్లు, వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు వస్తుంటారు. ఆస్పత్రికి వెళ్లాలంటే దూరంగా ఉన్న పెద అవుటపల్లి వద్ద అండర్ పాస్‌లో నుంచి మరలా తిరిగి ఆస్పత్రి వద్దకు చేరుకోవాల్సి వస్తోంది. ఈ క్రమంలో వేబ్రిడ్జి సమీపంలోని జాతీయ రహదారి జంక్షన్ వద్ద రోడ్డు దాటి రాంగ్ రూట్లో కనీసం కిలో మీటరు వాహనాలకు ఎదురు వెళ్లి ఆస్పత్రికి చేరుకుంటున్నారు. దీంతో ప్రమాదాల పాలవుతున్నారు. ఈ ప్రాంతంలో జాతీయ రహదారిపై అండర్ పాస్ కావాలని ఇక్కడి ప్రజలు ఎప్పటి నుంచో జాతీయ రహదారుల శాఖకు, ప్రజా ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు. చిన అవుటపల్లి గ్రామ సర్పంచ్ గోగులమూడి విజయలక్ష్మి ఇప్పటికే పలుమార్లు అర్జీలు అందజేశారు. ఇదే ప్రాంతంలో హైవే బైపాస్ వచ్చి జాతీయ రహదారికి కలుస్తుంది. ఇక్కడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కాబట్టి ఇక్కడ అండర్ పాస్ నిర్మిస్తే ప్రజల ప్రాణాలు కాపాడిన వారు అవుతారని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆస్పత్రికి వచ్చేవారు జాతీయ రహదారి దాటేందుకు ప్రయత్నిస్తూ వాహనాల కింద పడి ప్రాణాలు కోల్పోతున్నారు. అనేక మంది గాయాల పాలు అవుతున్నారు. ఆత్కూరు ఎస్‌ఐ పైడి బాబు మాట్లాడుతూ ఈ ప్రదేశంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అండర్ పాస్ నిర్మిస్తే ప్రమాదాల నివారణకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.



రాంగ్ రూట్‌లో వస్తున్న అంబులెన్స్



అండర్ పాస్ నిర్మించాలని కోరుతున్న ప్రదేశం

అండర్ పాస్ నిర్మించాలి



ఈ ప్రాంతంలో అండర్ పాస్ నిర్మించాలి. అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలి. ప్రజల ప్రాణాల రక్షణకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. హైవే బైపాస్ నిర్మాణ పనులు ఇక్కడే జరుగుతున్నాయి. ఇదే సందర్భంలో అధికారులు ప్రజల వినతిని పెద్ద మనస్సుతో స్వీకరించి కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలి. ప్రజా ప్రతినిధులను కలిసి మా వినతిని మరోసారి విన్నవిస్తాం.

– గోగులమూడి విజయలక్ష్మి, సర్పంచ్, చిన అవుటపల్లి

వేల మందికి మేలు జరుగుతుంది



జాతీయ రహదారిపై అండర్ పాస్ నిర్మాణం ఎంతో అవసరం. ప్రజలు ప్రయాణానికి అవస్థలు పడుతున్నారు. ప్రమాదాల పాలవుతున్నారు. పెద అవుటపల్లి వెళ్లి రావాలంటే ఎంతో వ్యయ ప్రయాసలకు గురి అవుతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని అండర్ పాస్ నిర్మిస్తే రోజూ వేలాది మందికి మేలు జరుగుతుంది.

– సరిహద్దు నాగరాజు, పల్లె వెలుగు అసోసియేషన్ అధ్యక్షుడు, చిన అవుటపల్లి

క్లుప్తంగా

ముగిసిన ఆధార్ ప్రత్యేక డ్రైవ్



కంకిపాడు: ఆధార్ నమోదు ప్రత్యేక డ్రైవ్ శనివారంతో ముగిసింది. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈనెల 23వ తేదీ నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. కంకిపాడు, పునాదిపాడు, ఈడుపుగల్లు, నెప్పల్లి, మద్దూరు, గొడవర్రు గ్రామాల్లోని సచివాలయాలు, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ప్రత్యేక క్యాంపులను 417 మంది ప్రజలు వినియోగించుకున్నారు. శిబిరాలను ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షించారు. ఆధార్ నమోదును సిబ్బంది బాధ్యతాయుతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు.

శాకంబరీ దేవి ప్రసాదం పంపిణీ



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శనివారం శాకంబరీ దేవి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఆషాఢ మాసం పురస్కరించుకుని ఆలయంలోని అమ్మవార్లను రకరకాల కూరగాయలు, పండ్లతో శాకంబరీ దేవీగా అలంకరించిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఆలయంలో అలంకరించిన కూరగాయలు, పండ్లను భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఆలయ ఈఓ పి. లోకేశ్వరి మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో అమ్మవార్లను శాకంబరీ దేవిగా అలంకరించినట్లు తెలిపారు.

సచివాలయ భవనాలు ప్రారంభం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 80 లక్షలతో నిర్మించిన రెండు సచివాలయ భవనాలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శనివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన 4వ సచివాలయాన్ని నూతన భవనంలో మార్చగా, మరో సచివాలయ భవనంలో శానిటరీ కార్యాలయం ఏర్పాటు చేశారు. అలాగే గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద, 1వ వార్డులో రూ. 7 లక్షలతో ఏర్పాటు చేసిన రెండు బోర్లను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ఇకపై నూతన భవనాల నుంచి ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుతాయన్నారు. గ్రామంలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటానన్నారు. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, టీడీపీ,జనసేన సమన్వయకర్త ముప్పారాజా, టీడీపీ నేతలు వెలగపూడి బాబూరావు, వెలగపూడి శంకర్‌బాబు, అనంతనేని అజాద్, ముప్పవరపు నారాయణ, మల్లంపాటి విజయ, షకీలా తదితరులు పాల్గొన్నారు.



యనమలకుదురులో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

వైఎస్సార్ సీపీ బ్యానర్ల తొలగింపు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వైఎస్సార్ సీపీకి చెందిన బ్యానర్లు మాత్రమే తొలగించడం వివాదాస్పదమైంది. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు పుట్టిన రోజును పురస్కరించుకుని రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లో అభిమానులు, కార్యకర్తలు, నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ పోల్ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే టీడీపీ కక్షసాధింపు చర్యల్లో భాగంగా పంచాయతీ అధికారులు బ్యానర్లు తొలగించాల్సిందిగా మండల అధికారులతో ఆదేశాలు జారీ చేయించారు. దీంతో ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బంది బ్యానర్లు తొలగించారు. దీంత పలు గ్రామాల్లో విచ్చలవిడిగా కట్టిన టీడీపీ, జనసేనకు చెందిన బ్యానర్లు అధికారులకు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.



ప్రసాదంపాడులో బ్యానర్లు తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

డప్పు కళాకారులకు యథావిధిగా పింఛన్లు ఇవ్వాలి

అంబాపురం(విజయవాడ రూరల్): అంబాపురం, పాతపాడు గ్రామాల్లోని చర్మకారులు, డప్పు కళాకారులకు యథావిధిగా పింఛన్లు పంపిణీ చేయాలని అంబాపురం గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్, కోకన్వీనర్ తోడేటి బెంజిమెన్, మాజీ సర్పంచ్ తోడేటి విజయకుమార్, దయాకర్, లబ్ధిదారులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆదేశాల మేరకు శనివారం అధికారులు అంబాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చర్మకారులు, డప్పు కళాకారుల లబ్ధిదారులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంటు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.సర్వేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి పథకం పనులపై సోషల్ ఆడిట్ బృందం నిర్వహించిన సామాజిక తనిఖీల్లో అంబాపురం, పాతపాడు గ్రామాల్లో చర్మకారులు, డప్పు కళాకారులుగా ప్రభుత్వం నుంచి పింఛన్లు పొందుతున్న వారు ప్రస్తుతం ఆ వృత్తి చేసుకోవడంలేదని డీఆర్‌డీఏ అధికారులకు తెలియజేశారు. ఈ మేరకు ఆ రెండు గ్రామాల్లోని లబ్ధిదారులకు సమాచారం అందివ్వడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో గతవారం ప్రజావేదికలో లబ్ధిదారులు వచ్చి తాము 2014వ సంవత్సరం నుంచి పింఛన్లు తీసుకుంటున్నామని, నిరుపేదలమైన మాకు పింఛన్లు నిలిపివేయవద్దని వినతి పత్రంతో కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గ్రామ సభ నిర్వహించామని లబ్ధిదారులు తమ వృత్తుల్లోనే కొనసాగుతున్నట్లు నిరూపణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. చర్మకారులకు, డప్పు కళాకారులకు ప్రభుత్వం అందజేసే పింఛన్లు నిలిపివేయవద్దని, అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు కావాలని ఈ దుశ్చర్యలకు పాల్పడినట్టు వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పింఛన్లు తీసుకుంటున్న వారికి ఎవ్వరికి ఆపవద్దని చెప్పినట్లు టీడీపీ జిల్లా కార్యదర్శి జి.బాబురావు, మండల పార్టీ అధ్యక్షుడు గొడ్డళ్ల రామారావు, గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య తెలిపారు. గ్రామ సభలో ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు, జూనియర్ అసిస్టెంటు విజయబాబు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

గ్రామ సమస్యలు పరిష్కరించాలని వినతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కె.సీతారామపురంలో అధ్వానంగా తయారైన డ్రైనేజీ, అంతర్గత రోడ్లును అభివృద్ధి చేయాలని, గ్రామ సచివాలయం ఏర్పాటు చేయాలని ఆ గ్రామ సర్పంచ్ చెన్నుబోయిన వెంకట మహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చెన్నుబోయిన వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెన్నుబోయిన శివయ్య, ఉప సర్పంచ్ బొకినాల బాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయ అధికారులను కలిసి గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజాప్రతినిధులు శనివారం వినతిపత్రం అందజేశారు. శేరినరసన్నపాలెం, కె.సీతారామపురం గ్రామాలకు కలిపి శేరినరసన్నపాలెంలో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాన్ని వారానికి మూడురోజుల పాటు కె.సీతారామపురంలో నిర్వహించాలని కోరారు. తొలుత కె.సీతారామపురానికి మంజూరైన గ్రామ సచివాలయాన్ని రాజకీయ ఒత్తిళ్లలో శేరినరసన్నపాలెం గ్రామానికి మార్చు చేశారని వాపోయారు. అలాగే ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామంలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించిందని, దోమలు, ఈగలు విపరీతంగా వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామస్తులు చెన్నుబోయిన నాగరాజు, ఉమామహేశ్వరరావు, బూర్లు శ్రీనివాసరావు, పానె శ్రీమన్నారాయణ, ఎనికేపల్లి రాఘవులు, చొడాడ పెద్దిరాజు, తట్టి జయరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగా సాధనతో మానసిక ప్రశాంతత

గన్నవరం రూరల్: ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతలను అధిగమించవచ్చునని సహజ యోగా ధ్యాన కేంద్రం రాష్ట్ర మహిళా విభాగం కోఆర్డినేటర్ సుగ్గుల సుధారాణి అన్నారు. వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు యోగా సాధనపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సహజ యోగా ప్రక్రియల ద్వారా ధ్యానం చేయడంతో ప్రతి ఒక్కరు తమలో ఉన్న వివేకం, విజ్ఞానం, మంచి గుణాలను పెంపొందించుకోవడం సాధ్యమన్నారు. ఎన్టీఆర్ జిల్లా కోఆర్డినేటర్ యర్రంశెట్టి గాంధీ మాట్లాడుతూ యోగా ద్వారా నాడులన్నీ చైతన్యవంతం అవుతాయన్నారు. యోగా సాధకులు విభిన్నంగా ఉండటంతో పాటు శాంతి కాముకులుగా సమాజాన్ని ప్రభావితం చేస్తారని పేర్కొన్నారు. చిన్న నాటి నుంచి యోగా సాధన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాగ శిరోమణి, లీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో యోగా సాధనలో పాల్గొన్న విద్యార్థులు

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ



ఉంగుటూరులో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ-2 సాంబశివరావు

ఉంగుటూరు: మండలంలోని ఉంగుటూరు, తేలప్రోలు గ్రామాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఎంఈఓ-2 జె.సాంబశివరావు పాఠ్యపుస్తకాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న తోడ్పాటును సద్వినియోగించుకోవాలని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య ఈ ఏడాది పెరిగిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్ కోఆర్డినేటర్ శారద, సీఆర్‌పీలు, తేలప్రోలు, ఉంగుటూరు కళాశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఈడుపుగల్లులో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రామవరప్పాడు: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మండల విద్యాశాఖాధికారి ఆదూరి వెంకటరత్నం అన్నారు. రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎకో క్లబ్ మిషన్ లైఫ్ డే, పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్ష, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ఎకో క్లబ్ డేను నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాలలో ఎకో క్లబ్‌లను ఏర్పాటు చేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. వెంకటరత్నం మాట్లాడుతూ అమ్మకు గుర్తుగా ప్రతి ఒక్క విద్యార్థి మొక్క నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మన నివాసాలు, కార్యాలయాల్లో, పరిసరాలు వంటి వీలైన చోట్ల మొక్కలు నాటి భూ మాతను రక్షించుకుందామని పిలుపునిచ్చారు. పాఠశాల హెచ్‌ఎం తయారు, ఏజీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ సాయి రున్నీసా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: మొక్కల పెంపకంతో కాలుష్య రహిత సమాజాన్ని స్థాపించవచ్చని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. ఉయ్యూరు ఎంకే గ్రూప్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో శనివారం వనమహోత్సవం నిర్వహించారు. మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన చైర్మన్ నాని విద్యార్థులకు మొక్కలు అందించి వాటిని నాటే కార్యక్రమం ప్రారంభించారు. విద్యాసంస్థల అధినేత ఎంకే బాబు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక సూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో 'అమ్మ పేరుతో మొక్క నాటుదాం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థుల తల్లుల సమక్షంలో పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. మొక్కల పెంపకం ఆవశ్యకతను, వాతావరణ సమతుల్యం గురించి హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు వివరించారు. విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు అక్కినేని రాఘవేంద్రరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణతోనే పర్యావరణం

కంకిపాడు: మొక్కల సంరక్షణతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.రాములు నాయక్ అన్నారు. శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో 50 మొక్కలు నాటారు. కె.రాములు నాయక్ మాట్లాడుతూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని నివారించుకోవాలని, దానికి మొక్కల పెంపకం ఒక్కటే మార్గమని అన్నారు. కార్యక్రమంలో గుడివాడ డీవైఈఓ ఐ.పద్మారాణి, సర్పంచ్ పి.ఇందిర, ఎంపీటీసీ సభ్యుడు బూరగ బాలాజీ, ఎంఈఓ కెఎస్‌వి. ప్రసాద్, హెచ్‌ఎం బి.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ జిల్లా పరిషత్ పాఠశాలలకు ఒక్కో పాఠశాలకు 50 చొప్పున మొక్కలు అందించారు.



మొక్కలు నాటుతున్న ఎంఈఓ వెంకటరత్నం తదితరులు

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

ఉయ్యూరు: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం సామాజిక బాధ్యత అని జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు అన్నారు. పెనమలూరు పోలీసుస్టేషన్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నాగరాజు అనారోగ్య కారణాలతో మృతి చెందారు. మరణించిన నాగరాజు 2003 బ్యాచ్ పోలీసు. దీంతో ఆ బ్యాచ్ పోలీసు సిబ్బంది సురేంద్ర, రవీంద్ర, శ్రీనివాస్, కిరణ్‌లు రూ. 65 వేలు సొమ్మును జిల్లా ఎస్పీ సమక్షంలో నాగరాజు కుటుంబ సభ్యులకు శనివారం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ గంగాధర్‌రావు 2003 బ్యాచ్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.



ఎస్పీ గంగాధర్‌రావు సమక్షంలో ఆర్థికసాయం అందజేస్తున్న 2003 బ్యాచ్ పోలీసులు

ముగిసిన టీచ్ టూల్స్ శిక్షణ

కంకిపాడు: బోధనలో నైపుణ్యాలను వృద్ధి చేసుకోవడం ద్వారా విద్యాభివృద్ధికి చర్యలు సమర్థంగా తీసుకోవచ్చని సమగ్రశిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.రాములు నాయక్, డీవైఈఓ పద్మారాణి సూచించారు. మండలంలోని ఈడుపుగల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో గుడివాడ డివిజన్ స్థాయిలోని 11 మండలాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఈనెల 16వ తేదీ నుంచి చేపట్టిన టీచ్ టూల్స్ శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. బోధనలో అనుసరించాల్సిన విధి విధానాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ కెఎస్‌వీ ప్రసాద్, టీచ్ టూల్స్ నోడల్ అధికారి లలిత మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

కంకిపాడు: ఆపన్నులను ఆదుకోవడం సామాజిక బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధులు, రిక్షా కార్మికులకు బియ్యం, ఇతర నిత్యావసరాలను శనివారం పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ పేదల సంక్షేమం, ఆపన్నులను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో అక్షర యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కె.శివయ్య, గాడ్ హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ రాజు, మాజీ సర్పంచ్ తత్తరమూడి వజ్రకుమారి, పంచాయతీ కార్యదర్శి ఓగిరాల రామకృష్ణ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వడ్డాది వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు టీక్వాక్ ఇంజక్షన్లు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శనివారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో టీక్వాక్ ఇంజక్షన్లు చేశారు. ఏఎన్ఎంలు జే సునీత, కే అరుణ, టీ రజని విద్యార్థులకు ఇంజక్షన్లు ఇచ్చారు. వ్యక్తిగత ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు గాయల పాలైనప్పుడు వెంటనే తగ్గేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తుగా ఇంజక్షన్లు ఇచ్చినట్లుగా వారు తెలిపారు. ఉపాధ్యాయుడు డి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.